క్లుప్తంగా

ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై 5 శాతం రాయితీ

నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై ఐదు శాతం రాయితీ ఇస్తున్నట్లు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ముందస్తుగా చెల్లించిన పౌరులకు ఈ రాయితీ వర్తించనుందన్నారు. 2025–26వ సంవత్సరానికి సంబంధించి మొదటి – రెండో అర్ధ సంవత్సరాల ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నును ఏకమొత్తంలో చెల్లింపు చేస్తే 5 శాతం రిబేట్ వర్తిస్తుందని, ఈ అవకాశం ఈ నెల 30 వరకు మాత్రమేనని స్పష్టం చేశారు. నగరవాసులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ముందస్తుగా పన్నులు చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

క్షేత్రపాలకుడికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఆంజనేయ స్వామివారి ఆలయం, అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆలయంతో పాటు పాత మెట్ల మార్గం వద్ద ఉన్న స్వామి వారి ఆలయంలో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత ఘాట్‌రోడ్డులోని ఆలయంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, నాగవల్లీ దళార్చన (తమలపాకులతో అర్చన)ను నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన ప్రత్యేక పూజలలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. చైత్ర శుద్ధ అష్టమిన క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీరామ నవమి, సోమవారం కళావేదికపై శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామని నిర్వాకులు పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై గోబెల్స్ ప్రచారం తగదు

వించిపేట(విజయవాడపశ్చిమ): వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో టీడీపీ తీరు దొంగే దొంగని అరిచిన చందంగా ఉందని వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకుడు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ విమర్శించారు. శనివారం వించిపేట పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకి మద్దతు పలికిన టీడీపీకి మైనారిటీలలో వ్యతిరేకత రావడం, ఆ పార్టీలోని మైనార్టీ నాయకులపై రాజీనామా ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని, దీంతో దిక్కుతోచని స్థితిలో వైఎస్సార్ సీపీపై దుర్మార్గ ప్రచారానికి తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును ఖండిస్తూ మైనారిటీల పక్షాన నిలబడి అటు లోక్ సభ, ఇటు రాజ్యసభలలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తన ఎంపీలతో ఓటేయించిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సమాజం తరుపున ఈ సందర్భంగా గౌస్‌మొహిద్దీన్ ధన్యవాదాలు తెలిపారు.

విశ్వ నవకార్ మహామంత్ర దివస్ పోస్టర్ ఆవిష్కరణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైన్ సంఘాల అనుబంధ సంస్థ జితో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే విశ్వ నవకార్ మహామంత్ర దివస్ కార్యక్రమం పోస్టర్‌ను శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించినట్లు కార్యక్రమ సమన్వయకర్త ప్రవీణ్‌జైన్ రాంకా తెలిపారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ జితో ఆధ్వర్యంలో దేశ వ్యాపితంగా అన్ని ప్రధాన పట్టణాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో విజయవాడ చాప్టర్ చైర్మన్ కమలేష్ ఫోలాముతా, ఉపాధ్యక్షుడు రాకేష్‌జైన్, ప్రధాన కార్యదర్శి మనీష్‌జైన్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): ఒకటో తేదీ రాగానే ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, పిల్లల ఫీజులు తదితర ఆర్థిక భారాలు పారిశుద్ధ్య కార్మికుల మీద ఎక్కువగా ఉన్నాయని, అందుకే ఒకటో తేదీకి వృద్ధాప్య పెన్షన్లు చెల్లిస్తున్న మాదిరి పారిశుద్ధ్య కార్మికులకు కూడా జీతాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, స్కూలు ఫీజులను అధిగమించి కనీస వేతనం అమలు కాకపోయినా ఇచ్చిన దాంట్లోనే సరిపెట్టుకొని జీవనం సాగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలన్నారు.

దర్గా వాడలో సమస్యల తిష్ఠ

- డ్రెయినేజి వ్యవస్థ లేక నిలిచిన మురుగు
- మెయిన్ రోడ్ మినహా అన్నీ రెండు, మూడడుగుల రోడ్లే
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు



పిచ్చి మొక్కలతో నిండి ఉన్న షాదీఖానా నిర్మాణానికి కేటాయించిన స్థలం



మురుగునీటి దుర్గంధంలో నివసిస్తున్న ముజావర్ల కుటుంబాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాలుగు శతాబ్దాలకుపైగా చరిత్ర ఉన్న హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా ప్రాంతంలో నివసిస్తున్న ముస్లిం మైనార్టీలు దయనీయ స్థితిలో ఉన్నారు. డ్రెయినేజి వ్యవస్థ లేకపోవడంతో దర్గా వాడ అధ్వానంగా తయారయ్యింది. జాతీయ రహదారి (65వ నెంబర్) పక్కనే నగరపాలక సంస్థ పరిధిలోని 41వ డివిజన్ కిందకు వచ్చే ఈ దర్గా వాడలో మెయిన్ రోడ్ మినహా (అదికూడా సుమారు ఐదు అడుగులే) మిగిలిన అన్ని అంతర్గత రోడ్లు కేవలం రెండు, మూడు అడుగుల వెడల్పులోనే ఉన్నాయి. కొన్ని రోడ్లలో అయితే ఇద్దరు మనుషులు పక్కపక్కనే నడవాలన్నా కష్టమే. ఈ ఇరుకు రోడ్లకు రెండు వైపులా ఉన్న సైడు కాలువల్లోని మురుగు నీరు ముందు కదిలే పరిస్థితి లేదు. ఎక్కడ మురుగు అక్కడే తిష్ఠ వేసి ఉంటుంది. కొన్ని కాలువలు చెత్తా చెదారం, వ్యర్థాలతో పూడుకుపోయి ఉన్నాయి. డ్రెయినేజి సౌకర్యం లేని ఇరుకు రోడ్లలోనే భారీ భవంతులు నిర్మించుకుని ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు. ఇంత ఇరుకు రోడ్లలో నివసించేవారిలో ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోతే అంబులెన్స్ కాదు కదా ఆటోకూడా ఇళ్ల ముందుకు వచ్చే పరిస్థితి లేదు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని చేతుల మీదుగా మోసుకురావడమో లేదా నడిపించుకుంటూ మెయిన్ రోడ్ మీదకు తీసుకురావల్సిన దుస్థితి నెలకొంది.

నోచుకోని షాదీఖానా నిర్మాణం..

దర్గా ప్రాంతంలో దాదాపు 400 ముజావర్ల (పూజారులు) కుటుంబాలతో పాటు 200 వరకు ఇతర కుటుంబాలు (ముస్లిం మైనార్టీలు) నివసిస్తున్నాయి. అంటే సుమారు మూడు వేల మంది జనాభా నివసిస్తున్నా మౌలిక వసతులు ఇక్కడ కానరావడం లేదు. వీరికోసం షాదీఖానా నిర్మించేందుకు (పెళ్లిళ్లు, ఫంక్షన్ల కోసం) దశాబ్దం కిందట వేసిన శిలాఫలకం ఇప్పటికీ వెక్కిరిస్తున్నట్లు దర్శనమిస్తోంది. షాదీఖానా నిర్మాణం కోసం కేటాయించిన స్థలం ఒక ఇరుకు సందు చివరిలో ఉండటంతో నిర్మాణ సామాగ్రి రవాణాకు వీలుపడని కారణంగా అది కాస్తా నిలిచిపోయింది. దాంతో షాదీఖానా కోసం స్థానికులు కన్న కలలు ఆవిరైపోయాయి. ప్రస్తుతం ఆ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తుంది. అయినా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒక్క షాదీఖానా నిర్మాణ విషయంలోనే కాదు.. దర్గా వాడలో కనీస వసతులను కల్పించటంలోనూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానిక ముస్లిం మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గంధంలో బతుకులు..

దర్గా వాడ చివర దర్గా ముజావర్ల కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములు నాలుగు పోర్షన్లలో నివసిస్తున్నారు. వారిలో ఇద్దరు సోదరుల పోర్షన్లకు దక్షిణం వైపు నడక దారి ఉంది. మరో రెండు కుటుంబాల వారు తూర్పు వైపున రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వారు నడిచే నడక దారి స్థలం తనదంటూ స్థానిక టీడీపీ నాయకుడు మూసేయటంతో వివాదం నెలకొంది. సైడు కాలువ నిర్మిద్దామని వచ్చిన వీఎంసీ అధికారులకు కూడా అతను అడ్డుపడటంతో అది అలానే ఉండిపోయింది. ఇది జరిగి దాదాపు ఏడేళ్లయినా.. సమస్య ఇంకా అపరిష్కృతంగానే ఉండిపోయింది. దాంతో ఎక్కడి మురుగు అక్కడ నిలిచిపోయి భరించరాని దుర్వాసనలకు నెలవయింది. దీంతో దుర్గంధం మధ్యే ఆ నాలుగు కుటుంబాలు నివసిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులైనా చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించకపోగా పూర్తిగా వదిలేశారని, కనీసం ముజావర్ల కమిటీ కూడా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుర్గమ్మకు నృత్యార్చన



ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు కళాకారులు నృత్యార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన నృత్యాచార్య వేదాంతం పార్థసారథి సారథ్యంలో 25 మందికి పైగా కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మ వారి పంచ హారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యాన్ని భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించి వారిని అభినందించారు. అనంతరం కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

–ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

నగరంలో ప్రీమియం జ్యువెలరీ బ్రాండ్ ఇంద్రియా



ఇంద్రియా జ్యువెలరీ షోరూంను ప్రారంభించి నగలను ప్రదర్శిస్తున్న సినీ నటి హన్సిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ప్రీమియం జ్యువెలరీ బ్రాండ్ ఇంద్రియా స్టోర్‌ను విజయవాడలో ప్రారంభించారు. మహాత్మాగాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను శనివారం సినీ నటి హన్సిక మాత్వాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రియా జ్యువెలరీ అద్భుతమైన నైపుణ్యంతో వినియోగదారులకు ఆభరణాలపై ఉన్న ప్రేమను మరింత గొప్పదిగా మారుస్తుందన్నారు. అనంతరం ఇంద్రియా సీఈఓ సందీప్ కోహ్లి మాట్లాడుతూ సంప్రదాయం, ఆధునికత కలిసి ఉండే విజయవాడ వంటి నగరం తమ దృక్పథానికి పరిపూర్ణ వేదిక అని అన్నారు. హైదరాబాద్‌లో మూడు స్టోర్ల తర్వాత దక్షిణ భారతదేశంలో ఇది నాలుగో స్టోర్ అని చెప్పారు. కార్యక్రమంలో రిటైల్ హెడ్ అనంత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై కోదండ రాముడు



గజ వాహనంపై విహరిస్తున్న రాములోరు



నగరాలు సీతారామస్వామి సన్నిధిలో పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి గజవాహన సేవ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి మూలవరులకు పంచామృత తిరుమంజనాన్ని వేదోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రామయ్యను గజవాహనంపై అధిష్ఠింపజేసి వైభవంగా సేవను నిర్వహించారు. వివాహ వేడుకలను పురస్కరించుకుని ఎదుర్కోలోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా కోదండరాముని, సీతామహాలక్ష్మీ అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ అర్చకస్వాములు కార్యక్రమ క్రతువుని కొనసాగించారు. అనంతరం వధూవరులైన స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాల బహూకరణ, భజనమండలి వారితో సంకీర్తనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు నిర్వహించారు.

నగరాల సీతారామస్వామి వారి ఆలయంలో..

కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం పలు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తుహోమం, భేరిపూజ, ధ్వజపట ప్రతిష్ఠ, ధ్వజారోహణాది కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ధ్వజారోహణం ద్వారా శ్రీసీతారామ కల్యాణానికి సకల దేవతామూర్తులను ఆహ్వానించడం జరిగిందని పండితులు పేర్కొన్నారు. సాయంత్రం ఆలయంలో స్వామివారికి గజవాహన సేవను అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు ఆలయ కమిటీ ప్రముఖులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి వేళాయె!

- వన్‌టౌన్‌లో నవమి వేడుకల సందడి
- ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయాలు





భావనారాయణవీధిలోని కోదండరామాలయం వద్ద ఏర్పాటుచేస్తున్న చలువ పందిరి కొత్తపేట నగరాల రామాలయం వద్ద ముస్తాబవుతున్న రథం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీరాముడి కల్యాణాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో నిర్వహించేందుకు నగరంలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. దీంతో నియోజకవర్గంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రామాలయాలు, వాణిజ్య సంఘాలు, వివిధ వైష్ణవాలయాల్లో నవమి వేడుకలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో రాములోరి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు చలువ పందిళ్లు, ఇతర కల్యాణ సన్నాహాలను పూర్తి చేసినట్లు నిర్వాహకులు వివరించారు.

ప్రారంభమైన నవమి వేడుకలు..

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని నగరాల సీతారామ స్వామి వారి దేవస్థానం, భావనారాయణవీధిలోని శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానంలో నవమి వేడుకలకు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటితో పాటుగా శివాలయంవీధిలోని రామాలయం, వస్త్రలత ప్రాంగణంలోని రామాలయం, సైకం వారి వీధిలోని రామాలయం, పలు వైష్ణవాలయాల్లో సైతం ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

కళకళలాడుతున్న బజార్లు..

శ్రీరామనవమి సందర్భంగా వ్యాపారులతో ఆయా ప్రాంతాల్లో కొనుగోలు దారులతో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్ పరిసరాలు రద్దీగా దర్శనమిస్తున్నాయి. నగరం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు మామిడి ఆకులు, ఇతర పూజా సామాగ్రిని విక్రయిస్తూ సందడి చేస్తున్నారు. వన్‌టౌన్‌లోని మెయిన్ బజార్, సామారంగంచౌక్, శివాలయంవీధి తదితర ప్రాంతాలు సైతం రద్దీగా దర్శనమిస్తున్నాయి.

ముచ్చటగొలుపుతున్న విగ్రహాలు..

నియోజకవర్గంలోని వివిధ సంఘాలు నిర్వహించే వేడుకలకు స్వామివారి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడం పరిపాటి. దాంతో ఆ విగ్రహాలు విక్రయిస్తున్న కార్మికులు వాటిని వివిధ ప్రాంతాల్లో జోరుగా విక్రయిస్తున్నారు. విక్రయిస్తున్న సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి మూర్తులు ముచ్చటగొలుపుతున్నాయి. వివిధ సైజుల్లో విగ్రహాలను కొనుగోలు చేయటానికి జనం ఆసక్తి చూపుతున్నారు.

అధిక ధరల్లో పూజాసామాగ్రి...

నవమి సందర్భంగా వన్‌టౌన్‌లో విక్రయించే పూజా సామగ్రికి ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. పూల ధరలు అమాంతం ఆకాశాన్ని తాకాయి. మూర మల్లెపూలు రూ.30లు పలుకుతున్నాయి. ఇళ్లకు తోరణాలు కట్టే మామిడి ఆకులు రెండు మండలు రూ.20 చొప్పున వ్యాపారులు వసూళ్లు చేస్తున్నారు. డజను అరటిపళ్లు కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో రూ.100లకు విక్రయిస్తున్నారు. ఇతర పూజాసామాగ్రి ధరలు సైతం అధికంగా ఉన్నాయంటూ కొనుగోలు దారులు చెబుతున్నారు.

భక్తి రసాత్మకంగా వాగ్గేయకార సంకీర్తనా గానం



విజయవాడకల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా మొగల్రాజపురంలోని కళాశాల కళాపీఠం వేదికపై యువ సంగీత కళాకారులు రామనామం భజరే పేరుతో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం రామభక్తి సామ్రాజ్యాన్ని చాటింది. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు పోపూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, మల్లాది రవికుమార్ బృంద సభ్యులు సద్గురువులు త్యాగరాజ స్వామి, రామదాసు తదితర వాగ్గేయకారులు రచించిన కీర్తనలను మధురంగా గానం చేశారు.

పది స్పాట్‌కు సెలవు ఇవ్వాలని వినతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని విజయవాడలో జరుగుతున్న పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌కు సెలవు ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఎన్టీఆర్ జిల్లాశాఖ నాయకులు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఫ్యాప్టో చైర్మన్ ఎ.సుందరయ్య, సెక్రటరీ డాక్టర్ ఇంటి రాజులు యూవీ సుబ్బారావును బిషప్ అజరయ్య హైస్కూల్‌లో జరుగుతున్న స్పాట్ కేంద్రంలో కలిసి వినతిపత్రాన్ని అందించి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల పక్షాన ప్రభుత్వానికి తెలియజేసి స్పాట్ కేంద్రానికి ఒక రోజు సెలవు ప్రకటించాలని కోరారు. పండుగను అందరూ జరుపుకోవటానికి సహకరించాలని సూచించారు. ఫ్యాప్టో నాయకులు వి.కొండలరావు, జె.రామకృష్ణ, బి.సుబ్బారెడ్డి, మస్తాన్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాక్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది

ఆ చిత్ర హీరో సిద్ధు జొన్నలగడ్డ




మీడియా సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య, నిర్మాత ప్రసాద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 10న విడుదల కానున్న జాక్ చలన చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని ఆ చిత్ర హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. కామెడీ, లవ్, యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. జాక్ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా హీరో జొన్నలగడ్డ సిద్ధు, హీరోయిన్ వైష్ణవి చైతన్య, నిర్మాత డీవీఎస్ ప్రసాద్ శనివారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ విజయవాడ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జాక్ మూవీ స్టోరీ విన్నప్పుడు చాలా ఎక్సైటింగ్‌గా ఫీల్ అయ్యానని, ఈ చిత్రంలో హీరోయిన్‌తో కెమిస్ట్రీ బాగా వర్క్ అవుట్ అయిందన్నారు. ఇంటర్వెల్ సన్నివేశాలు ఉత్కంఠకు గురి చేస్తాయన్నారు. జాక్ చిత్రానికి ముగ్గురు సంగీత దర్శకులు పని చేశారని, ఒక్కొక్క పాట చాలా డిఫరెంట్ గా ఉంటుందన్నారు. త్వరలో టిల్లు క్యూబ్, తెలుసు కదా సినిమాలతో ప్రేక్షకుల ముందుకి రాబోతున్నానని అన్నారు. హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ సిద్ధు జొన్నలగడ్డతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

హాజరైన వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు



బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ బాటలోనే తన పరిపాలనను కొనసాగించారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గ గుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శిరంశెట్టి పూర్ణచంద్రరావులు తదితర నేతలతో కలిసి బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్ రామ్, డా.బీఆర్.అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా వారి అడుగుజాడల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగారన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా జగన్ పాలన కొనసాగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే రాష్ట్ర ప్రజలు అసహనం వ్యక్తం చేశారని అన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపడతారని, బాబు జగజీవన్‌రామ్ కలల స్వరాజ్యాన్ని తీసుకొచ్చే విధంగా పాలన సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నేత బుదాల శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలిమెట్ల శరత్, పశ్చిమ ఎస్సీ సెల్ అధ్యక్షులు గంపల నవీన్, సీనియర్ నాయకులు దాసీజయప్రకాష్ కెనడి, కామళ్ల కోటేశ్వరరావు, జోజి, నాగళ్ల సంగీత బాబు, గోమతోటి వినోద్‌పాల్, మద్దిరాల కమలాకర్, గాదల లాజర్, రేవులగడ్డ విజయ్, గాలిదుర్గారావు, బోయల్ల రాజేష్, వడ్డాది జీవన్, మడికి బాబురావు, దొడ్డ సురేష్, రెండపోగు క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బార్ అసోసియేషన్‌లో...



బీబీఏ హాలులో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో న్యాయవాదులు

విజయవాడలీగల్: జగ్జీవన్‌రామ్ జీవితచరిత్ర స్ఫూర్తిదాయకమని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా అన్నారు. బార్ అసోసియేషన్ హాలులో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, జాయింట్ సెక్రటరీ జీవీ లక్ష్మి, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్, వీ గురునాథం, సంపర శ్రీనివాసరావు, కండెల వరప్రసాద్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.